ప్రీమియం మద్యం దుకాణానికి రెండు దరఖాస్తులు

కర్నూలు అర్బన్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): ప్రీమియం మద్యం దుకాణానికి రెండు దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు తెలిపారు. డిసెంబరు 31వ తేదీతో ప్రీమియం దుకాణానికి టెండర్లు ముగిశాయి. దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు, వార్షిక రుసుం రూ.కోటి, ప్రతీ ఏడాది పది శాతం రుసుం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో టెండర్ల దాఖలుకు ఎక్కువగా దరఖాస్తులు రాలేదు.



న్యూ ఇయర్ కేక్‌తో యువతి

హ్యాపీ న్యూ ఇయర్

- జ్ఞాపకాలతో 2024కు వీడ్కోలు
- 2025కు గ్రాండ్ వెల్‌కమ్
- జిల్లాలో అంబరాన్నంటిన సంబరాలు
- ఉత్సాహంగా కేక్ కటింగ్‌లు
- వేడుకల్లో యువతరం హంగామా

కర్నూలు కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆశయాలు.. నిర్ణయాలు.. వెరసి సంబరాలు.. సంతోషాల మేళవింపుతో 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కర్నూలు జిల్లా ప్రజలు 2025 కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. జిల్లా వ్యాప్తంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువత కేరింతల మధ్య నూతన సంవత్సర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పార్టీలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు న్యూ ఇయర్ కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. దీంతో కొనుగోలుదారులతో సందడిగా మారాయి. నగరంలో కొత్త సంవత్సర ఆరంభ వేడుకల్లో యువత సందడి చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చిన్నాపెద్దా అనే తేడా లేకుండా కేక్ కట్ చేసి న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. బైక్‌లపై తిరుగుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అర్ధరాత్రి వివిధ కూడళ్లలో యువత కేక్‌లు కట్‌చేసుకొని పరస్పరం కేక్‌లను అందించుకుంటూ ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. నగరంలో ఎలాంటి అపశ్రుతులకు చోటు లేకుండా పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు. నగరంలోని పలు చోట్ల మ్యూజిక్ సిస్టమ్స్ డీజే పాటలతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు.

ఆశలు.. ఆశయాలు!



కర్నూలు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):

కాలగమనంలో ఓ ఏడాది ముగిసింది. మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుని.. చెడు సంఘటనలు వదిలేస్తూ 2024కు ప్రతి ఒక్కరూ ఘన వీడ్కోలు పలికారు. సరికొత్త ఆశయాలు.. నిర్ణయాలు.. వెరసి సంబరాలు.. సంతోషాల మేళవింపుతో కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టారు. జిల్లా పాలనా యంత్రాంగం, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, యువత, మహిళలు.. ఇలా వివిధ వర్గాల వారిని ఆంధ్రజ్యోతి పలకరించింది. నవ వసంతంలో అడుగులు వేసిన వేళ ఎలాంటి లక్ష్యాలు నిర్దేశించుకున్నారని పలకరించింది. ఒక్కొక్కరిది ఒక్కో లక్ష్యం. అంతిమంగా ప్రగతి వికాశమే ఆశయంగా సాగుతామని వెల్లడించారు.

ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తా



2024లో పుట్టిపెరిగిన నా జిల్లాకు కలెక్టర్‌గా రావడం మరవలేని మధుర జ్ఞాపకం ఇది. 2025లో జిల్లా కలెక్టర్‌గా కరువు నివారణ లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తా. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, కర్నూలు హైకోర్టు బెంచ్ ఏర్పాటు, పారిశ్రామికవాడలో నీటి వసతి కోసం జలాశయం నిర్మాణం, పత్తికొండ టమోటా ప్రాసెసింగ్ యూనిట్, ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్కులకు భూ కేటాయింపులు పూర్తి చేసేందుకు కృషి చేస్తా. హంద్రీనీవా విస్తరణ పనులు పూర్తి చేయడంతో పాటు జిల్లాలో ప్రగతి వికాసానికి పాడుపడుతా.

– పి. రంజిత్‌బాషా, జిల్లా కలెక్టర్, కర్నూలు

ప్రాణం విలువ తెలిసేలా అవగాహన



మానవ తప్పిదాలు, ఆటోల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు సేఫ్టీ ఎంతో ముఖ్యం. టెక్నికల్ డ్రైవింగ్‌పై అవగాహన ఉండాలి. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. అదే క్రమంలో సెల్‌ఫోన్లలో అభ్యంతరకరమైన వెబ్‌సైట్లు వినియోగించి యువత పెడదారి పడుతున్నారు. మూడు అంశాలను ప్రత్యేకంగా తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పించేలా 2025లో ముందుకు వెళ్తాం. అదే క్రమంలో కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. ప్రాణం విలువ ప్రజలకు తెలిసేలా చైతన్యం కల్పించే ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతాం.

– డాక్టర్ కోయ ప్రవీణ్, డీఐజీ, కర్నూలు రేంజ్

- ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు
- సరికొత్త ఆశలకు ఊపిరి పోస్తూ
- 2025లో ఒక్కొక్కరిది ఒక్కో లక్ష్యం
- మంత్రి నుంచి సామాన్యుల వరకు మార్పు కోసం శపథం'

మిగతా 8లో..

పారిశ్రామిక ప్రగతే లక్ష్యం



రాజకీయ జీవితంలో 2024 మరువలేనిది. కర్నూలు ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాను. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో కీలకమైన పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాను. రాయలసీమ చిరకాల స్వప్నమైన హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదించేలా కీలక బాధ్యతలు పూర్తి చేశా. రూ.14 వేల కోట్ల పెట్టుబడితో సెమికండక్టర్ పరిశ్రమలకు ఓర్వకల్లుకు తీసుకొచ్చా. 2025లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, తీసుకొచ్చిన పరిశ్రమలు ప్రారంభించేలా కృషి చేస్తా. జిల్లాను పారిశ్రామిక ప్రగతి వైపు నడిపిస్తా. కర్నూలు నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్డు ఆధునికీకరణ, పచ్చదనం, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ముందుకు వెళ్తా. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.

– టీజీ భరత్, పరిశ్రమల శాఖ మంత్రి

సైబర్ క్రైంపై ప్రత్యేక ఫోకస్



సైబర్ క్రైం నివారణపై ప్రత్యేకంగా ఫోకస్ పెడతాం. బాధితులకు ఇప్పటికే రూ.50-60 లక్షలు ఇప్పించాం. ఫ్రీజ్ చేసిన రూ.1.50 కోట్లు 2025 సంక్రాంతిలోగా ఇప్పించాలన్నదే లక్ష్యం. నేరాల నియంత్రణంలో సాంకేతిక పరిజ్ఞానం జోడించేందుకు జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. 25 డ్రోన్లకు ఎంపీ నిధులు ఇచ్చేందుకు కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరిలు ముందుకు వచ్చారు. వీటితో బాధితులకు న్యాయం చేసే లక్ష్యంతో 2025లో ముందుకు వెళ్తాం. – జి. బిందుమాధవ్, ఎస్పీ, కర్నూలు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు, అధికారులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ నూతన సంవత్సరానికి ఆనందంగా స్వాగతం పలుకుదామని ఆయన పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇక నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు పూల దండలు, బొకేలు, స్వీట్స్ బదులు నోట్ బుక్స్, పెన్నులు, తదితర విద్యా సామగ్రి తీసుకురావాలని ఎంపీ కోరారు.

రెండో రోజూ కానిస్టేబుళ్ల పరీక్షలు

వివరాలు 9లో..

(7వ పేజీ తరువాయి)

ఆశలు.. ఆశయాలు!

నిరుద్యోగుల పరిస్థితి మారడం లేదు.



కొత్త సంవత్సరాలు వస్తున్న నిరుద్యోగుల పరిస్థితి మారడంలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేనే 2025 సంవత్సరం సంతోషంగా జరుపుకోవడానికి అవకాశం ఉంటుంది. డిగ్రీ, పీజీలు చదివి నిరుద్యోగ యువత ఉద్యోగాల లేకుండా నిరుపయోగంగా ఉన్న పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మారుతున్న ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలేదు. ప్రతి సంవత్సరం కూడా ఎంతో సంతోషంగా జరుపుకోవాలని నిరుద్యోగుల ఆశిస్తుంటారు. ఈ సంవత్సరమైన కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఉద్యోగాల భర్తీకి రూపకల్పన చేస్తేనే నిరుద్యోగుల కళ్లలో ఆనందం కనపడుతుంది.

- అబ్దుల్లా, కర్నూలు



చెరువులకు నీరు వదలాలి



వారసత్వంగా వచ్చిన ఎకరన్నర పొలంతోపాటు మరికొంతపొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. 2024 సంవత్సరం మాకు మంచి పంటలను అందించింది. ప్రధానవాణిజ్యపంట వేరుశనగ ఆశించిన స్థాయిలో దిగుబడిని అందించలేకపోయినా టమోటా ధర బాగా పలకడంతో లాభాలు వచ్చాయి. అలాగే పత్తికొండ, రాతన చెరువులకు నీరునింపితే కింద ప్రాంతంలో ఉన్న బోర్లకు నీరుచేరి తోటలసాగుచేసుకోవచ్చు. మూగజీవాలకు తాగేందుకు నీరు దొరుకుతుంది. ఈ ఏడాది మంచే జరుగుతుందన్న నమ్మకం ఉంది. - రామాంజనేయులు, రైతు, పత్తికొండ

కొత్త ఏడాదిలో ఆటో కొనాలి



కొత్త సంవత్సరంలో కొత్త ఆటో కొనుగోలు చేయాలి. 2024 సంవత్సరంలో అంతంత మాత్రంగానే ఉండేది. ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ వరకే డబ్బు సరిపోయేది. ఈ ఏడాదిలోనైనా ఆటోకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, రిపేరులు రాకుండా ఉండి మంచిగా జరగాలి. కొత్త ఆటో కొనుక్కోవాలన్నదే చిరకాల ఆశ.

- వీరేష్, ఆటో డ్రైవర్, ఆదోని

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో నాటకోత్సవాలు


కర్నూలు కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం నుంచి శుక్రవారం రాత్రి వరకు రాష్ట్రస్థాయి సాంఘిక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. హైదరాబాదులోని మహతి క్రియేషన్స్ సంస్థ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో, సీనియర్ సినీ, టీవీ నటుడు సుబ్బరాయశర్మ సారథ్యంలో ఈ నాటకోత్సవాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాదులోని గువ్వాడ క్రియేషన్స్ సంస్థ వారి 'మూల్యం', గుంటూరు జిల్లా కొలుకలూరు సాయి ఆర్ట్స్ సంస్థ వారి 'జనరల్ బోగీలు' నాటిక ప్రదర్శన లు ఉంటాయని తెలిపారు. గురువారం రాత్రి 6.30 గంటలకు మొదటి ప్రదర్శనగా గుంటూరు అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిరుగు మేఘం' రెండో ప్రదర్శనగా హైదరాబాదులోని డీఆర్కే ఫైన్ ఆర్ట్స్ వారి 'ఈ మంచం నాది కాదు' ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదు మహతి క్రియేషన్స్ సంస్థ వారి 'ఉక్కు సంకెళ్లు', అనంతరం కళాకారులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ నాటకోత్సవాల్లో మొదటి రోజున నాటకరంగానికి విశిష్ట సేవలు అందించిన కళాకారుడు పత్తి ఓబులయ్యకు, రెండో రోజున సినీ, నాటకరంగ నటుడు గోపరాజు రమణ, మూడో రోజున నంద్యాల కళారాధన సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణలకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే సినీ నటుడు సుబ్బరాయశర్మ తన పుట్టినరోజు సందర్భంగా మూడో రోజున ఇద్దరు కళాకారులకు రూ.5వేలు నగదు పారితోషికం ఇచ్చి సత్కరిస్తారని పత్తి ఓబులయ్య వివరించారు.

బొకేలు వద్దు.. మొక్కలు ముద్దు

ఎస్పీ జి. బిందుమాధవ్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బొకేలు వద్దని, మొక్కలు, పుస్తకాలు, పెన్సిళ్లు, దుప్పట్లు ముద్దని వాటి ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవాలని ఎస్పీ జి. బిందుమాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రీట్ విత్ గ్రీన్ సొసైటీ, జేవీవీ సభ్యులు ఎస్పీని కలిసి మొక్కలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలను బొకేలతో కాకుండా మొక్కలతో తెలుపుకోవాలని, తద్వారా పర్యావరణానికి మంచి చేసిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వీరేష్, శ్రీకాంత్, రామాంజనేయులు, వివేక్, వినోద్, రాజు, మహేంద్ర పాల్గొన్నారు.

కిక్కిరిసిన నగరం





కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్ల దుకాణాలు సందడిగా కనిపించాయి. కేక్‌లు, స్వీట్ల కొనుగోళ్లకు ప్రజలు ఉత్సాహం చూపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఉద్యోగులు, వ్యాపారులు బొకేలు, పూల దండలు కొనుగోలు చేయడం కానవచ్చింది. నగరంలో కొత్త సంవత్సర ఆరంభ వేడుకల్లో యువత సందడి చేశారు. బైక్‌లపై తిరుగుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అర్ధరాత్రి వివిధ కూడళ్లలో యువత కేక్‌లు కట్‌చేసుకొని పరస్పరం కేక్‌లను అందించుకుంటూ ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు.

- కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



నగరంలోని రాజ్‌విహార్ సమీపంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో నూతన సంవత్సర వేడుకల్లో యువత కేరింతలు

వైద్యసేవలపై ప్రజల్లో సంతృప్తి కలగాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా. శాంతికళ

• డీఎంహెచ్‌వో డా. శాంతికళ

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సేవలపై ప్రజల్లో మరింత సంతృప్తి కలిగేలా పని చేయాలని డీఎంహెచ్‌వో డా. శాంతికళ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని డీఎంహెచ్‌వో చాంబర్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. మాతా శిశు సంక్షేమ విషయంలో పకడ్బందీగా ప్రణాళిక అమలు చేయాలని మాతా శిశు మరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నివారించాలన్నారు. ప్రభుత్వ పథకాలైన 108, 104, తల్లి_బిడ్డ ఎక్స్‌ప్రెస్, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభించే సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. మలేరియా, డెంగ్యూ, మెదడు వాపు, చికెన్ గున్యా, టైఫాయిడ్, టీబీ, అసంక్రమిత వ్యాధులు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్లపై నాణ్యమైన సేవలు అందించాలన్నారు. జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్. భాస్కర్, డీఐవో డా. నాగప్రసాద్, డీపీసీఎస్ సంధ్య, ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్, డా. భాస్కర్ రెడ్డి, డీఎంవో నూకరాజు పాల్గొన్నారు.

గోదాములను అందుబాటులోకి తెస్తాం



రూ.2.50 కోట్లతో నిర్మించిన జంబో షెడ్డు గోదాము ఇదే

• సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన గోదాములను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభించామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మంగళవారం కమిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చు పెట్టి 2012లో నిర్మించిన జంబో షెడ్డు గోదామును వ్యవసాయ శాఖ పరికరాలను నిల్వ చేసి అద్దెను కూడా కట్టకుండా నిరుపయోగంగా ఉంచారని అన్నారు. ఈ పరికరాలను ఎక్కడికైనా తరలించి గోదామును తమకు స్వాధీనం చేయాలని వ్యవసాయ శాఖ జేడీకి పలుమార్లు లెటరు రాశామని అన్నారు. వారు స్పందించకపోవడం వల్ల మంగళవారం కలెక్టర్‌కు వివరిస్తూ లేఖ రాశామన్నారు. జంబో షెడ్డు గోదాము తమ స్వాధీనం అయితే.. నెలకు దాదాపు రూ. 4 నుంచి రూ. 5 లక్షల దాకా అద్దె లభిస్తుందని అన్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై అప్రమత్తంగా ఉండాలి

• న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూల లీగల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులపై సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి నేరస్థులను పట్టుకోవడంలో కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి కోరారు. మంగళవారం స్థానిక న్యాయ సేవా సదన్ భవనంలో జరిగిన హిట్ అండ్ రన్ కేసుల జిల్లా స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన హిట్ అండ్ కేసుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను హిట్ అండ్ రన్ కేసులలో నేరస్థులను పట్టుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన అధికారులతో చర్చించారు.

జలహారతిని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): తెలుగు తల్లికి జలహారతి పేరుతో చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేదామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వర రావు యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రజలంతా వలసలకు వెళ్లకుండా నివారించేందుకు సాగు చేసిన రైతుకు నీరందక, పంటలు చేతికందక, వర్షాలు రాక ఆత్మహత్యలకు పాల్పడేవారని, ఇక ఈ స్థితి నుండి విముక్తి కలగనుందని తెలిపారు. గోదావరి నుండి బనకచర్లకు నీటిని తెచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సీఎం, చంద్రబాబు కంకణం కట్టుకున్నారని తెలిపారు. దాదాపు రూ. 80 నుంచి రూ. 90 కోట్ల మేరకు నిధుల ద్వారా కేంద్ర ప్రభుత్వ, ప్రపంచ బ్యాంక్ సహకారంతో నిర్మాణాలకు రూపకల్పన చేశారన్నారు. నాయకులు ఆకెపోగు ప్రభాకర్, నంద్యాల నాగేంద్ర, కే. మహేష్ గౌడ్, నగరాజు యాదవ్, ఎల్‌వీ ప్రసాద్, షేక్షావలి పాల్గొన్నారు.

రెండో రోజూ కానిస్టేబుళ్ల పరీక్షలు



పర్యవేక్షిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

• 266 మంది హాజరు
• అర్హత సాధించిన 197 మంది

కర్నూలు క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం రెండో రోజు జరిగాయి. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు ఎస్పీ జి. బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 266 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజకల్ ఎఫీషియన్సీ టెస్టులు 1,600 మీటర్ల పరుగు పరీక్షలో 240 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 221 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 221 మంది పాల్గొనగా 149 మంది అర్హత సాధిం చారు. లాంగ్‌జంప్‌లో 221 మంది పాల్గొనగా 189 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు రెండో రోజు 197 మంది అర్హత సాధించారు.

అర్హులందరికీ పింఛన్

• 2,39,818 మందికి రూ.102.83 కోట్లు పంపిణీ
• కలెక్టర్ పి. రంజిత్‌బాషా



దివ్యాంగురాలికి పింఛన్ ఇస్తున్న కలెక్టర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. మంగళవారం నగరంలోని జొహరాపురంలోని పూల సుబ్బయ్య నగర్‌లో లక్ష్మీదేవికి వికలాంగ పింఛన్, రామలక్ష్మికి వితంతువు పింఛన్, నాగమణికి ఒంటరి మహిళా పింఛన్ వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1 నూతన సంవత్సరం కావడంతో ప్రభుత్వం ఒక్కరోజు ముందే పింఛన్ పంపిణీ చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్

• కలెక్టర్ పి. రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి. రంజిత్ బాషా హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్‌ఫోర్సు కమిటీలు సమర్థవం తంగా పని చేయాలన్నారు. మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు చురుగ్గా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మైనింగ్ అధికారి రవిచంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, భూగర్భ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్, డీటీసీ శాంతకుమారి, తుంగభద్ర దిగువ కాలువ ఈఈ శైలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు



మిల్లర్లతో మాట్లాడుతున్న జయలక్ష్మి

• మిల్లర్లతో చర్చించిన సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో 13 రకాల పంట ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున పంట ఉత్పత్తుల విక్రయం కర్నూలు మార్కెట్ యార్డులో జరగడం విశేషం. తాజాగా వరి ధాన్యం క్రయ విక్రయాలను చేపట్టేందుకు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి మంగళవారం తన కార్యాలయంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. మిల్లర్లకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని సంక్రాంతి పండుగ లోపు ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తామని అన్నారు. మిర్చి యార్డు సమీపంలో లేదా మరో చోట ధాన్యం అమ్మకాలను ప్రారంభించేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్‌తో పాటు టీఎన్‌టీయూసీ నాయకులు శేషగిరిశెట్టి పాల్గొన్నారు.







డీసీసీబీ సీఈవోగా వెంకటేశ్వరస్వామి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా హైదరాబాదుకు చెందిన వెంకటేశ్వరస్వామిని నియమిస్తూ ఆప్కాబ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు మంగళవారం కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయానికి చేరాయి. హైదరాబాదులో యూనియన్ బ్యాంకు రిటైర్డు చీఫ్ మేనేజర్‌గా పని చేసిన వెంకటేశ్వర స్వామి రెండు నెలల కిందట ఆప్కాబ్ నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ సీఈవో వెంకటేశ్వరస్వామి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా తనకు అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

15,458 హెక్టార్లలో డ్రిప్ పరికరాలు


కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సేద్యం కోసం మొదటిసారిగా ప్రభుత్వం 15,458 హెక్టార్లలో డ్రిప్పు పరికరాలను ఏర్పాటు లక్ష్యాన్ని నిర్దేశించిందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డ్రిప్పు పరికరాల ఏర్పాటు కోసం 14,235 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కలెక్టర్ ఇప్పటికే 2,618 మంది రైతులకు వారి పొలాల్లో డ్రిప్పు పరికరాలను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారని తెలిపారు. 2,139.67 హెక్టార్ల విస్తీర్ణం పొలాలకు డ్రిప్పు పరికరాలను అందించినట్లు తెలిపారు.

కందుల కొనుగోలుకు గోనె సంచులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల నుంచి కందులు కొనడానికి అవసరమైన గోనె సంచుల కోసం దాదాపు రూ.2 లక్షలతో ఏర్పాట్లు చేశామని జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రాజు మంగళవారం తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు రైతుల నుంచి కందులు కొనుగోలు చేసే ధరకే మార్క్‌ఫెడ్ సంస్థ కూడా రైతుల నుంచి కొని వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కందుల కొనుగోళ్లకు రైతులు తమ పేర్లను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్నారని అన్నారు.







ఉద్యమాలు చేస్తూనే ఉంటాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ - ముగిసిన సీపీఐ శతజయంతి ఉత్సవాలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ మీదుగా సీఆర్ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నగర కార్యదర్శి పి.రామ క్రిష్ణా రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో రామ క్రిష్ణ మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అయిందన్నారు. దేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రెండో పార్టీ సీపీఐ అన్నారు. పార్టీ ఆవిర్భవించిన తరువాత దానిని అంతం చేయాలని నాటి బ్రిటిష్ పాలకులు కాన్పూర్, మీరట్, పెషావర్‌లో కుట్ర కేసులు బనాయించారని గుర్తు చేశారు. పార్టీ నేత డాంగేను అండమాన్ జైల్లో 13 సంవత్సరలు నిర్బంధించారన్నారు. తెలంగాణలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా భూమి కోసం విముక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన 4500 మంది కార్యకర్తలను రక్తార్పణం అయిన పార్టీ సీపీఐ అన్నారు. ఎన్నికల్లో ప్రతి పేదవారికి పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. నగరశివారులో ఉన్న టిడ్కో ఇందిరమ్మ గృహాలను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 2 నుంచి 10 వరకు పేదవారి ఇంటి సలాలు, నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.రామాంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్య దర్శి లెనిన్‌బాబు, కార్యవర్గసభ్యులు జగన్నాథంలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, కార్యవర్గసభ్యులు నబీరసూల్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.రామకృష్ణ, హాజరైన సీపీఐ శ్రేణులు

వసతి గృహం తనిఖీ

కర్నూల లీగల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరునగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం తనిఖీ చేశారు. ఆయన అక్కడ వారితో మాట్లాడుతూ బాధితులు ఎవరైనా ఉచిత న్యాయ సహాయం కావాలంటే తమను ఆశ్రయించాలని సూచించారు. వృద్ధులకు, నిరాశ్రయులకు ఉన్న హక్కుల గురించి, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఆయన నిరాశ్రయులకు ఇస్తున్న భోజన వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాధనం వృథా

పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ.పుల్లారెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాలలో అభివృద్ధి పనుల పేరుతో నగర పాలక అధికారులు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆరోపించారు. మంగళవారం పాతబస్టాండు కొండారెడ్డిబురుజు ఎదురుగా ఓపెన్‌ఎయిర్ థియేటర్ కూల్చి నియమించిన పార్కు స్థలాన్ని సభ్యులతో కలిసి పరిశీలించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ అందమైన కట్టడాలు నిర్మించిన అధికారులు నిర్వహణను గాలికి వదిలేయడంతో పశువుల పాకలా మారిందని అన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఏ.నాగరాజు, ఎం.హనుమంతరెడ్డి, సర్దార్‌భాష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వసతులకు రూ.3 కోట్లు

● సూపరింటెండెంట్ డాక్టర్. కె. వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా రూ.3 కోట్ల గ్రాంట్ మంజూరైనట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన సర్వజన వైద్యశాలలో పలు విభాగాలను పరిశీలించారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.3 కోట్లతో సివిల్ వర్క్, డ్రైనేజీ మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్ ద్వారా ఆసుపత్రిని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గైనిక్ విభాగం ఫార్మసీ (నెంబర్.13)లో బాత్‌రూమ్‌ల కోసం ప్రతిపాదనలు ఇవ్వాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌ను ఆదేశించారు. గైనిక్ విభాగంలో ఏఎన్ఎం, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది ప్రసవం కోసం వచ్చే వారి నుంచి బలవంతపు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్షణమే ఆసపత్రి ఆవరణలో డ్రైనేజీ మరమ్మతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సీతారామయ్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళిని పాల్గొన్నారు.

లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

కర్నూలు రూరల్ డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లింగ బలిజ, వీరశైవలింగాయత్ కులాలను తక్షణమే ఓబీసీ జాబితాలో చేర్చాలని లింగబలిజ ఓబీసీ సాధన సమితి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చామకూర వీరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు నగరంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఆసంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఎంపీ మాట్లాడుతు వీరశైవలింగాయత్, లింగబలిజ కులాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎంపీ హామీనిచ్చారు. ఎంపీని కలిసిన వారిలో మంజునాథ్, సురేష్, సోమేశ్,రాంబాబు, నాగరాజు,గోపినాథ్, చంద్రరాజు, రాము ఉన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

కర్నూలు న్యూసిటీ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా నగర పాలక పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల రెగ్యులర్ కార్మిక సిబ్బందికి మూడు జతల వస్త్రాలు, మూడు టవళ్లను, 2 జతల చెప్పులను కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పంపిణీ చేశారు. మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండులోని శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు యూనుస్, కార్పొరేటర్లు పరమేష్, ఫరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మండల ఈవోఆర్డీ పదవి వీరమణ

కర్నూలు రూరల్ డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ఈవోఆర్డీ అనురాధ మంగళవారం పదవీ విరమణ పొందారు. ఆమె ఏడాది పాటు మండలంలో ఈవోఆర్డీగా విధులు నిర్వహించారు. అంతకముందు ఇదే మండలంలోనే పసుపుల గ్రామ గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పని చేశారు. అనంతరం ఈవోఆర్డీగా పదోన్నతి పొంది దాదాపు ఏడాదిపాటు విధులు నిర్వహించి పదవీవిరమణ పొందారు.

సైన్స్‌తో పరిజ్ఞానం



విద్యార్థులు తయారు చేసిన నమునాను పరిశీలిస్తున్న ఎంఈవో

దేవనకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌తో విద్యార్థులకు పరిజ్ఞానం అబ్బుతుందని ఎంఈవో-2 నిర్మలాదేవి అన్నారు. మంగళవారం జడ్పీ పాఠశాలలో తెర్నేకల్, పి. కోటకొండ, కుంకనూరు, కెజీబీవీ విద్యార్థులు సైన్స్‌ఫేర్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. హెచ్‌ఎం మద్దిలేటి, శివలక్ష్మి, ఉస్మాన్, వీరేషప్ప, పాల్గొన్నారు

కురువలను ఎస్సీల్లోకి చేర్చకండి : ఎమ్మార్పీఎస్

ఆలూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మదాసి కురువ, మదారి కురువ సామాజిక వర్గాలను కులగణనలో ఎస్సీలుగా నమోదు చేయవద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జిల్లా నాయకుడు ముత్యాల గాదిలింగ మాట్లాడుతూ హొళగుంద, ఆస్పరి మండలంలో కురువలను సచివాలయల్లో ఎస్సీలుగా నమోదు చేయడం వల్ల దళితులు అన్యాయానికి గురి అవుతారన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కురువలను ఎస్సీలుగా ఎలా పరిగణిస్తారని మండిపడ్డారు. తక్షణమే ఈ ప్రక్రియను నిలిపివేసి ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకున్నవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. సుధాకర్, బాలరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారు

- టీడీపీలో దళితులకు సముచిత స్థానం
- పార్టీ నాయకుడు సుబ్బరాయుడు



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు

వెల్దుర్తి/టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, కాటసాని చిచ్చుపెడుతున్నారని టీడీపీ జిల్లా నాయకుడు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. హత్యకేసులో ముద్దాయిలను వెంటబెట్టుకొని వైసీపీ నాయకులు సుధాకర్, శ్రీదేవి, రాంభూపాల్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్ కర్నూలులో ప్రెస్‌మీట్ నిర్వహించి అవాస్తవాలు మాట్లాడారన్నారు. మండలంలో టీడీపీకి మెజార్టీ వచ్చిందనే అక్కసుతోనే జూన్ 9న గిరినాథ్ చౌదరిని హత్య చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేలది ఫ్యాక్షన్ సంస్కృతి అని అన్నారు. గతంలో కాంగ్రెస్ కాటసాని ఎమ్మెల్యేగా, నారాయణరెడ్డి మండల నాయకుడుగా ఉన్న సమయంలో బీసన్న, సోమన్న అనే వ్యక్తులను, అనేకమంది దళితులను హత్యచేశారని తెలిపారు. చెర్లకొత్తూరు గ్రామంలోని ఎస్సీల భూములను శ్రీదేవి ఆక్రమించి, మామిడి చెట్లను నరికించివేశారన్నారు. గతంలో బిజ్జం పార్థసారథ రెడ్డి, కేఈ. ప్రభాకర్, కేఈ.శ్యాంబాబుపై కూడా దాడులు చేయించారన్నారు. నాయకులు బలరాంగౌడ్, రామకృష్ణాచారి, రమాకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, రామకృష్ణ బజారు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకే కొనుగోళ్లు

- నాసిరకం టమోటాలను జ్యూస్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నాం : ఏడీఎం



మాట్లాడుతున్న నారాయణస్వామి

పత్తికొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో టమోటాను గిట్టుబాటు ధరకే కొనుగోలు చేస్తున్నామని ఏడీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'టమోతా' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. మార్కెట్‌లో కొనుగోళ్లను కార్యదర్శి కార్నలీస్‌లో కలిసి పరిశీలించారు. నాణ్యమైన టమోటా మంగళవారం కనిష్టం రూ.9, గరిష్టం రూ.17 వరకు పలికాయన్నారు. సాధారణ టమోటా లను కూడా రూ.8 ప్రకారం వ్యాపారులు కొనుగోలుచేశారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరకల్పించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పట్టా భూములను ఎలా మార్చారు?



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోని రూరల్ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తమ పట్టా భూములను ఏలా మార్చరని రైతులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. మంగళవారం ఆదోని మండలం కుప్పగల్లులో తహసీల్దార్ శివరాముడు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. దాదాపు 18మంది రైతులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యంతో 60 ఎకరాలు పైబడి పట్టా భూములను రైల్వే భూములుగా మార్చారని, దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ 40రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

తుగ్గలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాప్లాతండా తదితర గ్రామాల్లో సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు పత్తికొండ ఎక్సైజ్ సీఐ ఈశ్వర్‌రావు తెలిపారు. 300 లీటర్ల సారాను ధ్వంసం చేశామన్నారు. సారా, ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో తుగ్గలి టాప్



తుగ్గలిలో సభ్యత్వం నమోదు చేస్తున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో నియోజకవర్గం లోనే తుగ్గలి మండలం టాప్‌గా నిలిచిందని పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం తుగ్గలి లో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. నియోజక వర్గంలో 13,500 సభ్యత్వాలు నమోదు కాగా, తుగ్గలిలో 1,800 సభ్యత్వాలు చేయించామ న్నారు. మండలంలో 3,800 ఓటర్లు ఉన్నారని, 50శాతం సభ్యత్వం తీసుకోవడం హర్షిం చదగ్గ విషయమని అన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, సర్పంచ్ రవి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హెల్మెట్ జీవితానికి భరోసా



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పత్తికొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ జీవితానికి భరోసా ఇస్తుందని ఆర్డీవో శశిదీప్తి, సీఐ జయన్న సూచించారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో మైత్రి చారిటబుల్ ట్రస్టు అదినేత రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకర మమన్నారు. పమాదాల్లో మరణిస్తున్న వారిలో అధికశాతం వాహనదారులు హెల్మెట్ దరించని వారేనన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద హరివాణం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీలో బాలుర జట్టు ప్రథమ స్థానంలో, బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం ఇందిరాదేవి మంగళవారం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో ఉజ్వల మిత్రమండలి నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు రాణించడం అభినందనీయమని అన్నారు. పీడీ రామన్న, ఉపాధ్యాయులు రామకృష్ణ, రమణమూర్తి, కృష్ణవేణి గణేష్ నాగేంద్ర, గోపాల్, సుబ్బయ్య, ఎల్లప్ప పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్న చంద్రబాబు

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



ఆలూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా నగర్‌లో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. బీజేపీ ఇన్‌చార్జి వెంకట రాముడు, టీడీపీ కన్వీనర్ అశోక్, నాయకులు నరసప్ప, త్యాగరాజు, కొమ్ము రామాంజినేయులు, మాల జగన్, కొమ్ము రాజు, గోపీ, హనుమప్ప, గోవింద్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోండి

హొళగుంద: ఎమ్మెల్యే విరుపాక్షి అసత్య ప్రచారాలను మానుకోవాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ మండిపడ్డారు. హొళగుంద నుంచి హన్నూరు కొట్టాల గ్రామానికి నిర్మిస్తున్న బీటీ రోడ్డును పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు మంజూరయ్యాయన్నారు. బీజేపీ నాయకుడు వెంకటరాముడు, టీడీపీ నాయకులు అబ్దుల్ సుభాన్, మిక్కిలి నేని రమేష్, శీను పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

పత్తికొండ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జెండా ఎగురవేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కడవల రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, ఎస్ఎఫ్ఐ నాయకులు రంజిత్, వివేక్, ఇమామ్‌బీ, కౌసల్య పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా హనుమేష్

పత్తికొండ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పత్తికొండ నియోజకవర్గం ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన హనుమేష్ ఎన్నికయ్యారు. కర్నూలు మహాసభలో ఎన్నుకోవడంపై తాలుకా అధ్యక్షుడు పెద్దయ్య, పత్తికొండ మండల అధ్యక్ష కార్యదర్శులు రవి, ఉపేంద్ర, టౌన్ అధ్యక్షులు విజయ్, కార్యదర్శి ఆల్తాఫ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

చైర్మన్‌గా అవకాశమివ్వాలి

ఆలూరు, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా తనకు అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీపీ బిలేకల్ వెంకటేష్ కోరారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతిని కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రతిభ చూపితే భవిష్యత్తు

మద్దికెర, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ చూపితేనే భవిష్యత్తు ఉం టుందని ఎంఈవో గోపాల్ మంగళవారం అన్నారు. అబాకస్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన వశిష్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థి ధనుంజ యను అభినందించారు. ఉపాధ్యాయులు ఫక్కీరప్ప, గోవింద్, రామాంజనేయులు, మురళి ఉన్నారు.

పరిష్కారానికే సదస్సు

ఆలూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. మండలంలోని గోనెహాల్ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కొల్లమ్మ, టీడీపీ నాయకులు వడ్డె రామేష్, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్వోలు రవికుమార్, ఆనంద్, లింగన్న, విజయకుమార్, వన్నూర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన నగరం





కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్ల దుకాణాలు సందడిగా కనిపించాయి. కేకులు, స్వీట్ల కొనుగోళ్లకు ప్రజలు ఉత్సాహం చూపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఉద్యోగులు, వ్యాపారులు బొకేలు, పూల దండలు కొనుగోలు చేయడం కానవచ్చింది. నగరంలో కొత్త సంవత్సర ఆరంభ వేడుకల్లో యువత సందడి చేశారు. బైక్‌లపై తిరుగుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అర్ధరాత్రి వివిధ కూడళ్లలో యువత కేక్‌లు కట్‌చేసుకొని పరస్పరం కేక్‌లను అందించుకుంటూ ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు.

- కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)





న్యూ ఇయర్ బార్బీకేక్



కేకును కొనుగోలు చేస్తున్న యువతి



నగరంలోని రాజ్‌విహార్ సమీపంలో కిక్కిరిసిన పూలబొకేల దుకాణాలు

బొకేలు వద్దు.. మొక్కలు ముద్దు

ఎస్పీ జి. బిందుమాధవ్



ఎస్పీకి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బొకేలు వద్దని, మొక్కలు, పుస్తకాలు, పెన్సిళ్లు, దుప్పట్లు ముద్దని వాటి ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవాలని ఎస్పీ జి. బిందుమాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రీట్ విత్ గ్రీన్ సొసైటీ, జేవీవీ సభ్యులు ఎస్పీని కలిసి మొక్కలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలను బొకేలతో కాకుండా మొక్కలతో తెలుపుకోవాలని, తద్వారా పర్యావరణానికి మంచి చేసిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వీరేష్, శ్రీకాంత్, రామాంజనేయులు, వివేక్, వినోద్, రాజు, మహేంద్ర పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 113 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 15 గ్రామాల్లోని రెవెన్యూ సదస్సులో 113 అర్జీలను స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం నెరుడుప్పలలో 6, నందవరం మండలం పెద్దకొటిలీకిలో 8, కౌతాళం మండలం లింగాలదిన్నెలో 5, అగసలదిన్నెలో, 2 మంత్రాలయం మండలం నారాయణపురంలో 1, ఆదోని మండలం కుప్పగల్లు గ్రామంలో 4, బేలేకల్‌లో 5, హొళగుంద మండలం మూగమానుగొందిలో 12, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలో కన్నమడకలలో 12, కల్లూరు మండలం కే. మార్కాపురంలో 10, వెల్దుర్తి మండలం బోగోలులో 7, కర్నూలు రూరల్‌లోని పంచలింగాలలో 20, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో 8, ఆలూరు మండలంలోని ఏ. గోనేహాల్‌లో 4, ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డిలో 9 అర్జీలు వచ్చాయన్నారు. అట్లాగే గురువారం 17 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో నాటకోత్సవాలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం నుంచి శుక్రవారం రాత్రి వరకు రాష్ట్రస్థాయి సాంఘిక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. హైదరాబాదులోని మహతి క్రియేషన్స్ సంస్థ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో, సీనియర్ సినీ, టీవీ నటుడు సుబ్బరాయశర్మ సారధ్యంలో ఈ నాటకోత్సవాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాదులోని గువ్వాడ క్రియేషన్స్ సంస్థ వారి 'మూల్యం', గుంటూరు జిల్లా కొలుకలూరు సాయి ఆర్ట్స్ సంస్థ వారి 'జనరల్ బోగీలు' నాటిక ప్రదర్శన లు ఉంటాయని తెలిపారు. గురువారం రాత్రి 6.30 గంటలకు మొదటి ప్రదర్శనగా గుంటూరు అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిరుగు మేఘం' రెండో ప్రదర్శనగా హైదరాబాదులోని డీఆర్కే ఫైన్ ఆర్ట్స్ వారి 'ఈ మంచం నాది కాదు' ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదు మహతి క్రియేషన్స్ సంస్థ వారి 'ఉక్కు సంకెళ్లు', అనంతరం కళాకారులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ నాటకోత్సవాల్లో మొదటి రోజున నాటక రంగానికి విశిష్ట సేవలు అందించిన కళాకారుడు పత్తి ఓబులయ్యకు, రెండో రోజున సినీ, నాటకరంగ నటుడు గోపరాజు రమణ, మూడో రోజున నంద్యాల కళారాధన సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణలకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే సినీ నటుడు సుబ్బరాయశర్మ తన పుట్టినరోజు సందర్భంగా మూడో రోజున ఇద్దరు కళాకారులకు రూ.5వేలు నగదు పారితోషికం ఇచ్చి సత్కరిస్తారని పత్తి ఓబులయ్య వివరించారు.

లోకాయుక్తలో క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప లోకాయుక్త పి.రజని

కర్నూల లీగల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఏపీ ఉప లోకాయుక్త పి. రజని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక లోకాయుక్త భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు లోకాయుక్త కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె లోకాయుక్త కార్యాలయంలో 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

(7వ పేజీ తరువాయి)

ఆశలు.. ఆశయాలు!



నిరుద్యోగుల పరిస్థితి మారడం లేదు.



కొత్త సంవత్సరాలు వస్తున్న నిరుద్యోగుల పరిస్థితి మారడంలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేనే 2025 సంవత్సరం సంతోషంగా జరుపుకోవడానికి అవకాశం ఉంటుంది. డిగ్రీ, పీజీలు చదివి నిరుద్యోగ యువత ఉద్యోగాల లేకుండా నిరుపయోగంగా ఉన్న పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మారుతున్న ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలేదు. ప్రతి సంవత్సరం కూడా ఎంతో సంతోషంగా జరుపుకోవాలని నిరుద్యోగుల ఆశిస్తుంటారు. ఈ సంవత్సరమైన కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఉద్యోగాల భర్తీకి రూపకల్పన చేస్తేనే నిరుద్యోగుల కళ్లలో ఆనందం కనపడుతుంది.

- అబ్దుల్లా, కర్నూలు

చెరువులకు నీరు వదలాలి



వారసత్వంగా వచ్చిన ఎకరన్నర పొలంతోపాటు మరికొంతపొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. 2024 సంవత్సరం మాకు మంచి పంటలను అందించింది. ప్రధానవాణిజ్యపంట వేరుశనగ ఆశించిన స్థాయిలో దిగుబడిని అందించలేకపోయినా టమోటా ధర బాగా పలకడంతో లాభాలు వచ్చాయి. అలాగే పత్తికొండ, రాతన చెరువులకు నీరునింపితే కింద ప్రాంతంలో ఉన్న బోర్లకు నీరుచేరి తోటల సాగుచేసుకోవచ్చు. మూగజీవాలకు తాగేందుకు నీరు దొరుకుతుంది. ఈ ఏడాది మంచే జరుగుతుందన్న నమ్మకం ఉంది. - రామాంజనేయులు, సన్నకారురైతు, పత్తికొండ

కొత్త ఏడాదిలో ఆటో కొనాలి



కొత్త సంవత్సరంలో కొత్త ఆటో కొనుగోలు చేయాలి. 2024 సంవత్సరంలో అంతంత మాత్రంగానే ఉండేది. ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ వరకే డబ్బు సరిపోయేది. ఈ ఏడాదిలోనైనా ఆటోకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, రిపేరులు రాకుండా ఉండి మంచిగా జరగాలి. కొత్త ఆటో కొనుక్కోవాలన్నదే చిరకాల ఆశ.

- వీరేష్, ఆటో డ్రైవర్, ఆదోని

చంద్రబాబుతోనే ముస్లింల సంక్షేమం

- న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్
- ఆత్మకూరులో జరిగే తబ్లీగ్ ఇస్తేమాకు రూ.2 కోట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్



మాట్లాడుతున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

ఆత్మకూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హయాంలోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర మైనార్టీ సంక్షేమం, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జనవరి 7,8,9 తేదీల్లో జరగబోవు తబ్లీగ్ ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరులో జరిగే ఇస్తేమా కార్యక్రమానికి సుమారు 3 లక్షల మంది ముస్లింలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏలోటు రానివ్వకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 2019లో కర్నూలులో జరిగిన అంతర్జాతీయ ఇస్తేమాకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10కోట్ల నిధులను ఇచ్చిందని గుర్తు చేశారు. ఇటీవల మసీదు, చర్చీల్లో పనిచేసే ఇమామ్, మోజన్, పాస్టర్లకు కూడా గౌరవ వేతనాలు అందించినట్లు వివరించారు. ముస్లింల సంక్షేమానికి కేటాయించిన నిధులను కూడా దారి మళ్లించినట్లు చెప్పారు. అనంతరం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఆత్మకూరులో భారీ ఇస్తేమా జరగడం విషయమని అన్నారు. ఇస్తేమా ఏర్పాట్లలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించి విజయవంతం చేయాలని అధికారులను సూచించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. ఇస్తేమా ఏర్పాట్ల నిర్వహణలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎస్పీ రామాంజీనాయక్, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

వాళ్లవి బెదిరింపు రాజకీయాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ

డోన్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ ఆరోపించారు. పట్టణంలోని పాతబస్టాండు రైల్వేస్టేషన్ రోడ్డులో మంగళవారం సాయంత్రం సీపీఐ నూరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కొత్తబస్టాండు ప్రధాన రోడ్డు నుంచి పాతబస్టాండు వరకు సీపీఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు హాజరైన వారిని ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ పార్లమెంటులో ఇటీవల భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్ ఖండించకపోవడం దారుణమన్నారు. ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే కరెంటు చార్జీలు పెంచిందన్నారు. ఆదానితో విద్యుత్ ఒప్పందం చేసుకుని రాష్ట్ర ప్రజలపై రూ.1.10 లక్షల కోట్ల విద్యుత్ భారాన్ని సీఎం చంద్రబాబు వేస్తున్నారని అన్నారు. ఆదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య, మోట రాముడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు నారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ

పట్టణంలోని గుత్తి రోడ్డులోని అమ్మా హోటల్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ విగ్రహాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమ్మ హోటల్ సర్కిల్‌లో భగత్‌సింగ్ సర్కిల్‌గా నామకరణం చేయాలని ఆయన మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బాల్య వివాహాలను నియంత్రించండి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నివరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో వివిధ అంశాలపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణిలకు అనుబంధ పోషకాహారాన్ని అందిస్తున్న వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. అంగన్‌వాడీ వర్కర్‌లతో సమావేశం నిర్వహించి వచ్చే సమావేశం నాటికి తక్కువ బరువు ఉన్న 4,118 పిల్లలందరూ సాధారణ స్థితికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. దేవనకొండ మండలం తెర్నేకల్ క్లస్టర్ సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడంతో పాటు డిసిప్లనరీ యాక్షన్ తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 0-6 ఏళ్ల పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంటులో పురోగతి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీవోలు సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- జిల్లా ప్రజలకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు



బనగానపల్లె, డిసెంబరు 31, (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు, రైతులు, యువత, అన్ని వర్గాల ప్రజలు నూతన సంవత్సరంలో పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీసీ కుటుంబ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో వర్షాలు బాగా పడి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో గ్రామాలు కళకళలాడాలని కోరారు. కొత్త సంవత్సరంలో ప్రజలకు అంతా మంచి జరగాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా నూతన సంవత్సరం వేడుకలకు తాను దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో నూతన సంవత్సరం సందర్భంగా బనగానపల్లెలో అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ క్యాంపు కార్యాలయానికి రాకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని మంత్రి బీసీ పిలుపునిచ్చారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

● కమిషనర్ ఎస్. రవీంద్రబాబు



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. వేదిక కార్యక్రమంలో వచ్చిన పలు ఫిర్యాదులకు సంబంధించిన ప్రాంతాలను మంగళవారం కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. 1వ వార్డులో చిదంబరావు వీధి, నాగమయ్యకట్ట, రాఘవేంద్ర మఠం తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల సమస్యలను కమిషనర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణం, ప్రధాన మురుగు కాలువల అనుసంధాన ప్రదేశం మార్పుల పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమలో ఆరోగ్య అధికారి డా.కే. విశ్వేశ్వరరెడ్డి, కార్పొరేటర్ షాషావలి, ఎంఈ సత్యనారాయణ, డీఈఈ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకేష్, ఏఈ స్వాతి పాల్గొన్నారు.

● నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరిని నగరంలోని ఆటోనగర్‌లో నివాసంలో మంగళవారం నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్లూరు అర్బన్ సంబంధించి పలు సమస్యలపై చర్చించారు.

● నగర పాలక కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ పొందిన అసిస్టెంట్ ఎగ్జామినర్ డి.చక్రపాణిని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సన్మానించారు. నగర పాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు సహచర అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, అకౌంట్స్ ఆఫీసర్ చండీప్రసాద్, ఆడిట్ అధికారి మురళి, తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప లోకాయుక్త పి.రజని

కర్నూల లీగల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఏపీ ఉప లోకాయుక్త పి.రజని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక లోకాయుక్త భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు లోకాయుక్త కృషి చేస్తుందన్నారు. అనంతరం లోకాయుక్త కార్యాలయంలో 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ఓర్వకల్లు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని సోమయాజుల పల్లె పంచాయతీలో మంగళవారం నిర్వహించిన సదస్సులో వ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ద కాశీం, ఈవో మద్దిలేటి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు సుదాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభల లోగోను స్థానిక సీఆర్ భవన్‌లో మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, మాజీ రాష్ట్ర నాయకులు జగన్నాథం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షులుగా శ్రీరాములుగౌడు, ఉపాధ్యక్షులుగా రమేష్, హనుమేష్, కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా బీసన్న, రాజీవ్, రాజు, సాబీర్‌తో పాటు మరో 41 మందిని ఎన్నుకున్నారు.

కళావాహిని గౌరవాధ్యక్షురాలు ఎం.రాణెమ్మ మృతి



రాణెమ్మ (ఫైల్)

కర్నూలు కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ గౌరవాధ్యక్షురాలు, కళావాహిని సంస్థ అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు మాతృమూర్తి ఎం. రాణెమ్మ (88) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నగరంలోని సత్యనారాయణ నగర్‌లోని ఆమె స్వగృహంలో మృతి చెందారు. రాణెమ్మ నాటక ప్రదర్శనలకు, సంస్థ ద్వారా నాటక పోటీల నిర్వహణలకు కృషి చేశారు. రాణెమ్మ మృతి కళారంగానికి తీరని లోటని పలువురు కళాకారులు కొనియాడారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం పోరాటాలు చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య భవన్‌ని సీపీఎం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యులు జి .రామక్రిష్ణ, పీఎస్.రాధాక్రిష్ణ, ఎండి.అంజిబాబు, టి.రాముడులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరులో నిర్వహించిన సీపీఎం పార్టీ 23వ జిల్లా మహాసభల్లో 9 మంది కార్యవర్గ సభ్యులు, 26 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నామని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలకు నూతన కమిటీ కృషి చేస్తుందని అన్నారు.

ఉనికి కోసమే వైసీపీ ఆరాటం

● ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేస్తున్న ప్రభుత్వం
● ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు , డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసమే వైసీపీ ఆరాట పడుతుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని మారెమ్మ గుడి ప్రాంతంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీని గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచటానికి కారణం వైసీపీ అధినేత జగన్ అన్నారు. వైసీపీ నాయకులు ఆందోళనలు చేయాలనుకుంటే చార్జీలు పెరగటానికి కారణమైన జగన్ ఇంటి ముందు ధర్నాలు చేయాలన్నారు. దాన్ని మరచి ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు చేయటమేమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నాయుడు దశలవారిగా అమలు చేస్తారని ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదన్నారు. ఇచ్చిన హామీమేరకు పింఛను పెంచటమే కాకుండా ప్రతినెల ఇంటింటికి పంపిణీ చేస్తున్నామన్నారు.

● **ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే:**

మారెమ్మ కొండ ప్రాంతంలో పింఛన్లు పంపిణీకి వెళ్లిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆ ప్రాంతంలో ఉన్న మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను స్థానిక హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది, మంచి భోజనం పెడుతున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు మరుగుదొడ్డి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పాఠశాల సమీపంలో కొండ పక్కను ఉన్న స్థలాన్ని అధికారులతో పరిశీలించారు. స్థలాన్ని సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ గంగిరెడ్డి, ఎంఈవో మధుసూదన్‌రాజు, టీడీపీ వార్డు ఇన్‌చార్జీ అల్తాఫ్, నాయకులు వీరేష్, రామకృష్ణ నాయుడు, మల్లయ్య, నవాజ్, షాలేమ్, ఇసాకు, అమాన్, వాహీద్, వహాబు, రఫీక్, ఈరన్న, కృష్ణ, రామకృష్ణ, బీజేపీ నాయకులు నరసింహులు, శివ పాల్గొన్నారు.


పట్టణంలోని మారెమ్మ గుడి ప్రాంతంలో వృద్ధురాలికి పింఛను డబ్బు అందజేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుంది : రాఘవేంద్రరెడ్డి

కోసిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం పల్లెపాడు గ్రామంలో సర్పంచ్ పైఇంటి రాజేంద్రనాయుడు, టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో రాఘవేంద్రరెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సోమప్ప, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, సాంబయ్య, చిన్న తాయన్న, వక్రాణి వెంకటేశ్, మాలపల్లి లక్ష్మన్న, ఈరేష్, ఈరన్న, అర్జున్, తాయన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం పల్లెపాడు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలకు ప్రథమ స్థానం ఇచ్చారని, నామినేటెడ్ పదవుల్లో కూడా 50శాతం బీసీలకే ఇచ్చి న్యాయం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు.


పల్లెపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

ఎన్టీఆర్ సామాజిక పింఛన్ పంపిణీ

నందవరం: మండలంలోని ముగతి గ్రామంలో కొత్తగా మంజూరు అయిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈరన్నగౌడు, భార్గవ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొచ్చు రంగన్న, కడుబూరి, అర్జున్, భార్గవ్, వెలుగు సీసీ చెన్నమ్మ, సచివాలయ అధికారులు నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మెదడుకు పని పెట్టాలి

- రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్


మాట్లాడుతున్న రాయలసీమ రేంజ్ రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్

గోనెగండ్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెక్నాలజీపై ఎక్కువగా ఆధారపడకుండా మెదడుకు పని పెట్టాలని, దీనివల్ల విద్యార్థుల్లో మానసిక, జ్ఞాపక శక్తి పెరుగుతాయని రాయలసీమ రెంజ్ రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణను ఆయన పరిశీలించారు. నిరూపయోగంగా ఉన్న మరుగుదొడ్లను, పాఠశాల ఆవరణంలో ఉన్న రాళ్లను తీసివేయాలని కోరారు. మన ఊరు మన స్కూలు, మన గ్రౌండ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. రోగుల కోసం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. నీటి ట్యాంక్‌లకు గ్రిల్ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అన్నివిధాల సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠ, ప్రిన్సిపల్ షహానా పర్వీన్, గౌస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైదవ శంఖారావం మహాసభలను జయప్రదం చేయాలని హైదవ ధర్మపరిరక్షణ సంఘాల నాయకులు సత్యనారాయణరెడ్డి, దయాసాగర్, నారాయణ, బజారప్ప, యాపిలయ్య కోరారు. మంగళవారం స్థానిక గీతామందిరంలో హైదవశంఖారావం మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి వైజ్ఞానిక సదస్సు

కౌతాళం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారులు రామాంజనేయులు, శోభారాణిల ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి వైజ్ఞానిక సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప హాజరై ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఉత్తమ ప్రాజెక్టులకు టీడీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సుధాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మల్లికార్జున, శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, నాయకులు రాజబాబు ఉన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప


ప్రథమ బహుమతిని గెలుచుకున్న మంత్రాలయం విద్యార్థులు

సైన్స్‌ఫెయిర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

కోసిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రణయ్ కుమార్ రెడ్డి, ప్రాజెక్టు టీచర్ మోహన్‌బాబుల ఆధ్వర్యంలో ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్స్ అనే అంశ ప్రదర్శన జిల్లా స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి మొయినుద్దీన్ తెలిపారు. విద్యార్థి ప్రణయ్ కుమార్ రెడ్డి బృందానికి ఎంఈవో బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని పది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 129 ప్రదర్శనలను ఇచ్చారు. ఇందులో కొన్ని ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి జనవరి నెల 3న జిల్లా స్థాయిలో కర్నూలు నగరంలో జరిగే ప్రదర్శనలకు పంపనున్నట్లు ఎంఈవో నీలకంఠం తెలిపారు. ఎంపీడీవో మణిమంజరి ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో పలు

మంత్రాలయం: మంత్రాలయం మండలంలో ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మంత్రాలయం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ఎంఈవోలు మైనొద్దీన్, రాగన్నలు పరిశీలించి మొదటి బహుమతిని శ్రీవైష్ణవి పాఠశాల, రెండో బహుమతిగా తుంగభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల, మూడో బహుమతిగా మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంలు హంపయ్య, జాన్సన్, లచ్చప్ప, బోజరాజు, విఠోబరావు, చంద్రశేఖర్, సౌమ్య, రామకృష్ణ, శంకర్, ప్రసన్నకుమారి, వరలక్ష్మి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.


నందవరంలో ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న ఎంఈవో

నందవరం: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవో రఘునాథ్ తెలిపారు. మంగళవారం నందవరం హైస్కూల్‌లో జరుగుతున్న మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. వీటిలో మూడు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరాం, బసవరాజు, ఈరన్న, ఎల్లప్ప, సత్యన్న, శ్రీనివాసులు, గురుప్రసాద్, కేశవయ్య, ఉరుకుందు, మహేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల


అంతరాష్ట్ర వాలీబాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించనున్న అంతర్రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్లను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలు జనవరి 15నుంచి 17వరకు నిర్వహిస్తునట్లు వివరించారు. మొదటి బహుమతి రూ40వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో రూ20వేలు, 4వ బహుమతి రూ10వేలతో పాటు షీల్డ్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ ఆర్గనైజర్లు బందే నవాజ్, రాజేష్, మల్లి, వీరేష్, శేషాద్రి, అంబయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఎల్లవేళలా ముందుండి పోరాటం చేస్తుందన్నారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి తక్షణమే ఐఆర్‌ను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో హంపయ్య, రాజు, కాశింజి, పంపన్న, దొడ్డిమేకల టీచర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కొలతలు తప్పని సరి: ఎంపీడీవో

నందవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో కొలతలు తప్పని సరిగా ఉండాలని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. మంగళవారం మండలోని హలహర్వి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కొలతల్లో వెడల్పు, నిలువ ఎంత ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. కూలీల హాజరు పట్టిక, పని జరిగే తేదీ, పని ప్రదేశం అందులో పొందపరచాలన్నారు. మస్టర్‌లో ఎంత మంది కూలీలు, ఎంత మేరకు పని చేశారో ఉండాలన్నారు. ఉపాధి పని జరిగే తీరుతో పాటు ప్రతిది నోట్ చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డ్ ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. రోజుకు కూలీ వేతనం రూ. 300 పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, ఈసీ నూర్జహన్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

మంత్రాలయం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామసమీపంలో లారీ, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం మంగళవారం సాయంత్రం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల మేరకు ఆదోని నుంచి రాయచూరుకు వస్తున్న లారీ రచ్చుమర్రి నుంచి ఆదోనికి వెళ్తున్న పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు బైక్‌పై వెళ్తుండగా ఢీ కొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. బంధువులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మంత్రాలయం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంత్రాలయం, మాధవరం, తుంగభద్ర, వగరూరు, తిమ్మాపురం, చెట్నహళ్లి తదితర గ్రామాల్లో సీఎస్ఐ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1గంట వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 2024కు వీడ్కోలు పలుకుతూ.. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేలుస్తూ కొత్త సంవత్సరానికి కొవ్వొత్తులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రైస్తవ ఆధ్యాత్మిక భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకుని మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజనల్ చైర్మన్ రెవ.వేదనాయకం, జాన్‌వెస్లీ, ఎస్‌డీ రాజన్న, ఏసయ్య రాజు, దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలి'

మంత్రాలయం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదిగిన మాదాసి కురువల పేరుతో ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయడం సరికాదని, వెంటనే వాటిని రద్దు చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ రత్నం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు నేపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం చిలకలడోన గ్రామంలో వీఆర్వో ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ప్రకాశం, తిక్కయ్య, లక్ష్మన్న, డేవిడ్, స్టీఫెన్, హనుమంతు, యేసేబు, రామన్న, రంగన్న, మహానంది, ఆనోకు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: ఎస్సీ కులగణన నుంచి మాదాసి, మాదారి కురవలను తొలగించాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మండ్రి దావీదు, జైబీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గంథలము మణికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని హలహర్వి సచివాలయ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. 170 మందికి అక్రమంగా ఇచ్చిన సర్టిఫికెట్లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాసు, సురేష్, ఏసోపు, ప్రభాకర్, యర్రన్న, దుబ్బన్న, చిన్నదావీదు, ఆంధ్రయ్య, ఇమ్మానియేలు పాల్గొన్నారు.